## పాకాల ఆయకట్టులో పూర్తిస్థాయిలో పంటలు సాగు చేయాలి

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల తీర్మానం

- జనగామ జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి మృతికి సభ్యుల సంతాపం
- వివిధ శాఖలపై అధికారులు, ప్రజాప్రతినిధుల సమీక్ష


ఖానాపురం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

ఖానాపురం, డిసెంబర్ 9: వచ్చే యాసంగిలో పాకాల ఆయకట్టు పరిధిలో పూర్తిస్థాయిలో పంటలు సాగు చేయాలని, గత యాసంగిలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారంలో అవకతవకలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానించారు. ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా జనగామ జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి మృతికి సభ్యులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్షించారు. ముందుగా వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో ఏవో శ్రీనివాస్ నివేదికను చదివి వినిపించారు. ఎంపీపీ ప్రకాశ్‌రావు, నాజీతండా సర్పంచ్ బాలకిషన్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పంట నష్టపరిహారం అందని రైతుల కోసం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నర్సంపేట నియోజకవర్గానికి రూ. 37 కోట్లతో సబ్సిడీపై యంత్ర పరికరాలను తీసుకొచ్చారన్నారు. మండలంలోని రైతులకు రూ. 6 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఇందులో ఎన్నికలకు ముందు రూ. 1.15 కోట్ల యంత్ర పరికరాలను రైతులకు అందజేసినట్లు వివరించారు. మిగిలిన రూ. 4.85 కోట్ల యంత్ర పరికరాలను వెంటనే రైతులకు అందజేయాలని సభలో తీర్మానించారు. పరిహారం పంపిణీలో అవకతవకలు జరిగాయని కొందరు రైతులు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో తక్షణమే విజిలెన్స్ విచారణ చేసి, తప్పులు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా భూమి లేకుండా పరిహారం పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాకాల ఆయకట్టులో ఈ సంవత్సరం వరి కోతలు ముందుగా వచ్చాయని, ఇప్పటికే 60 శాతం పూర్తయినట్లు వివరించారు. యాసంగి సాగును డిసెంబర్ 15లోగా నిర్ణయించాలన్నారు.

### పూర్తిస్థాయి సాగుకు అవకాశం కల్పించాలి

గత ఏడాది యాసంగిలో పూర్తిస్థాయిలో సాగు చేపట్టినందున ఈ సంవత్సరం కూడా అవకాశం కల్పించాలని ఎంపీపీ, నాజీతండా సర్పంచ్ కోరారు. తుఫాన్ ప్రభావంతో మిర్చి, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వెంటనే వ్యవసాయాధికారులు నష్టాన్ని అంచనా వేసి ప్రతి రైతుకు ఎకరాకు రూ. 10 వేల పరిహారం అందించాలన్నారు. ఎంపీపీ విద్యుత్ శాఖపై సమీక్షిస్తూ ప్రభుత్వం గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్‌ను ఎప్పటి నుంచి అమలు చేస్తుందో చెప్పాలని, అదనపు యూనిట్లు వినియోగిస్తే బిల్లు ఎలా వస్తుందో విధివిధానాలపై అధికారులు స్పష్టత నివ్వాలన్నారు. ఏఈ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు తమకు ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదన్నారు. మిషన్ భగీరథ పథకంపై బుధరావుపేట సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మిషన్ భగీరథలో చేసిన పనులకు అధికారుల అలసత్వంతోనే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల ముందు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మండలానికి దళితబంధు, బీసీ కార్పొరేషన్‌లో లబ్ధిదారులను ఎంపిక చేశారని, వారికి ప్రొసీడింగ్స్ సైతం వచ్చాయని, వారందరికీ తక్షణమే నగదును ఖాతాల్లో జమయ్యేలా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ చూపాలన్నారు. అదేవిధంగా మండలంలో పలు తండాలకు బీటీరోడ్లు, గ్రామాలకు సీసీరోడ్లు మంజూరయ్యాయని, నిర్మాణ దశలో ఉన్న అన్ని రోడ్లను పూర్తి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే, ఇతర శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. అటవీ, ఐటీడీఏ శాఖల అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టారు. సమావేశంలో ఎంపీడీవో సుమనావాణి, వైస్ ఎంపీపీ రామసహాయం ఉమారాణి, ఎంపీటీసీలు మత్రి కవిత, బోడ భారతి, షేక్ సుభాన్‌బీ, పూల్‌సింగ్, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

## 17 నుంచి ధనుర్మాసోత్సవాలు

నర్సంపేట, డిసెంబర్ 9: పట్టణంలోని వెంకటేశ్వరాలయంలో ఈ నెల 17 నుంచి ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 5 గంటలకు ఆలయంలో తిరుప్పావై సేవాకలం ప్రారంభమై.. 14 జనవరి వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. 23న ఉదయం 5 గంటలకు వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారా దర్శనం ఉంటుందన్నారు. 8న సహస్ర దీపాలంకరణ, 11న కూడారై మహోత్సవం, 14న గోదా రంగనాయకస్వామి కల్యాణం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు దుబ్బా రమేశ్, బాల్నె సర్వేశం, సింగిరికొండ రవీందర్, వేంశెట్టి శ్రీనివాస్, రామగోని సుధాకర్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా తిరుప్పాడ సేవ


గిర్మాజీపేట: అన్నకూటోత్సవానికి హారతి ఇస్తున్న అర్చకులు

గిర్మాజీపేట, డిసెంబర్ 9: బట్టలబజార్‌లోని వేంకటేశ్వరాలయంలో కార్తీకమాసం చివరి శనివారం సందర్భంగా స్వామివారికి తిరుప్పావడసేవ (అన్నకూటోత్సవం) కార్యక్రమాన్ని ఈవో ఎలపాటి రత్నాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీధరాచార్యులు, శేషాచార్యులు, శ్రీనివాసాచార్యుల వేద మంత్రోచ్ఛారణాల మధ్య శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పుల్లూరు అమరేందర్, కందిమల్ల రఘుప్రసాద్, నూకా వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ రవికుమార్ దంపతుల సహకారంతో నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాసాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్, రాజగోపాల్, సేవా సమితి సభ్యులు రవ్వ కృష్ణమూర్తి, నూకా సందీప్, లక్ష్మణ్, మాధవి, అశోక్, గందె గోవిందరాజులు, జూనియర్ అసిస్టెంట్ సాంబయ్య, సిబ్బంది విజయమ్మ, రాధమ్మ, భక్తులు పాల్గొన్నారు.

## 'ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించాలి'


మున్నా

శాయంపేట/నర్సంపేట, డిసెంబర్ 9: రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ మున్నా కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం ట్విట్ చేశారు. ప్రభుత్వం మహిళలకు కల్పించిన విధంగానే దివ్యాంగులకు కూడా అన్ని రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు.

## 'గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి'

శాయంపేట, డిసెంబర్ 9: గ్యాస్ వినియోగదారులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆదిరెడ్డి భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు దుంపల తిరుపతిరెడ్డి శనివారం కోరారు. వినియోగదారులు ఆధార్‌కార్డుతో లింక్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 31వ తేదీలోగా అవకాశం ఉంటుందని తెలిపారు.

## రైతు వేదికలోకి ఏవో కార్యాలయం

శాయంపేట, డిసెంబర్ 9: మండలకేంద్రంలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని మార్చారు. ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయంలోని ఓ గదిలో ఏవో గంగాజమున విధులు నిర్వర్తిస్తున్నారు. రైతులకు చేరువయ్యేందుకు మైలారంరోడ్డులోని రైతు వేదికలోకి ఏవో కార్యాలయాన్ని మార్చినట్లు ఏవో తెలిపారు. ఇక నుంచి రైతువేదికలో సేవలు అందుతాయన్నారు.

## ల్యాదెళ్లలో ఉచిత వైద్య శిబిరం

దామెర, డిసెంబర్ 9: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ల్యాదెళ్లలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులు, రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయచందర్‌రెడ్డి మాట్లాడుతూ 60 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి వద్దే చికిత్స అందించేందుకు హనుమకొండ రెడ్‌క్రాస్ సంచార వైద్యశాల ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి పాపిరెడ్డి, డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, గుల్లెపెల్లి శివకుమార్, సాగర్, పవన్, కేశోజు రమేశ్ పాల్గొన్నారు.


ల్యాదెళ్లలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

## ఆర్టీసీ ఉచిత ప్రయాణం ప్రారంభం



పరకాల: ఉచిత ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి

నడికూడ(పరకాల)/నర్సంపేట, డిసెంబర్ 9: పరకాల పట్టణంలో మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణాన్ని డిపో మేనేజర్ రవిచందర్ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకులం ప్రిన్సిపాల్ శోభారాణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె వెలుగు, సిటీ ఆర్డినరి, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కృష్ణకుమారి, అసిస్టెంట్ ఇంజినీర్ రాజశ్రీ, అసర్, చిన్న రాజయ్య, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని డీఎం ప్రసూనలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ మేరీ ప్రారంభించారు. ఈ మేరకు బస్టాండ్ ఆవరణలో పల్లెవెలుగు బస్సును మధ్యాహ్నం 2 గంటలకు జెండా ఊపి ప్రారంభించారు. మహిళలు గుర్తింపు కార్డు వెంట తెచ్చుకుంటే బస్సులో జీరో టికెట్ ఇస్తారన్నారు.

## 'నిషేధిత పురుగు మందులను పిచికారీ చేయొద్దు'


శాయంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజ్వల్ ప్రతినిధులు, మహిళలు

శాయంపేట, డిసెంబర్ 9: మోనోక్రోటోఫాస్, ట్రైజోఫస్, కార్బండిజమ్ వంటి విషపూరిత పురుగు మందులను పొలాల్లో పిచికారీ చేయొద్దని బీసీఐ ప్రాజెక్టు మేనేజర్ ప్రియాంకరెడ్డి అన్నారు. కాట్రపల్లి, సాధన్‌పల్లిలో ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ ద్వారా శనివారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పురుగు మందులను నిషేధించాయని ప్రియాంకరెడ్డి చెప్పారు. గర్భిణులు, బాలింతలు పురుగు మందు పిచికారీ సమయంలో పంట చేలకు వెళ్లొద్దన్నారు. బడీడు పిల్లలను పనికి పంపించొద్దన్నారు. కార్యక్రమంలో రైతులు వెంకటేశ్, మిట్టపల్లి రమేశ్, దోబిలి రామారావు, మిట్టపల్లి సతీశ్, ఎల్ గణేశ్, పాక ఐలయ్య, ముత్యం ఎర్రన్న, కట్ల సాంబయ్య, ప్రజ్వల్ సంస్థ ప్రతినిధులు దొడ్డిపాక రవిచందర్, షేక్ గౌస్, మనోహర్, పోతు సునీల్, తరాల తిరుపతి, కుక్కల కల్పన, పొరండ్ల భానుమతి, ఏదుల హిమబిందు, పల్నాటి రాంబాబు, ప్రశాంత్ పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

చెన్నారావుపేట, డిసెంబర్ 9: కుక్కల దాడిలో మహిళ గాయపడిన ఘటన మండలకేంద్రంలో శనివారం జరిగింది. మండలకేంద్రానికి చెందిన బండి నర్సమ్మ కూలి పని ముగించుకుని ఇంటికి వెళ్తున్నది. ఈ క్రమంలో కుక్కల గుంపు ఒక్కసారిగా నర్సమ్మపై దాడి చేసి గాయపరిచాయి. వెంటనే ఆమెను దవాఖానకు తరలించారు. అలాగే, ఎల్లాయగూడెం మాధవనగర్ కాలనీకి చెందిన గాదె సరిత–తిరుపతి దంపతుల కుమారుడు బంటిపై కుక్కలు దాడి చేశాయి.

## 'పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'


వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

నర్సంపేట, డిసెంబర్ 9: తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు నర్సంపేట ఆర్డీవో కార్యాలయంలో సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి నర్సంపేట డివిజన్‌లో వరి, మొక్కజొన్న, మిరప పంటలు నేలమట్టమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో ఎలకంటి రాజేందర్, గట్టి కృష్ణ, జక్కుల తిరుపతి, బోగి సారంగపాణి, భీమగాని మల్లయ్య, సాంబయ్య, వీరస్వామి, రవి, విజయ్ పాల్గొన్నారు.

## పాఠశాలలో మాక్ అసెంబ్లీ

దామెర, డిసెంబర్ 9: ల్యాదెళ్ల వికాస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులతో స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించి, వారికి విధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సీఎం, ఎమ్మెల్యేలు, మంత్రులుగా విధులు నిర్వర్తించి ప్రజాస్వామ్యయుతంగా పరిపాలనా అందించడంపై మంత్రివర్గంలో చర్చించారు. అనంతరం ప్రజాపరిపాలనా అందిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎండీ అక్బర్, ఎన్.బాబు, యశ్వంత్‌చారి, యూసుఫ్ పాషా, శ్రీజ, ఆశ, సంగీత, సాత్విక, శివగణేశ్ పాల్గొన్నారు.


మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు